# కథాకేళి



## మల్లాది వెంకటకృష్ణమూర్తి

# పొట్టి చెవాకులు కథ

"అయ్యా, అయ్యా మన ముఖ్య అమాత్యులవారు ఆకస్మిక, ఆశ్చర్య తణిఖీ చేయుటకు మన కార్యాలయమునకు వేంచేచిరి". బంట్రోతు ఉప ముఖ్య వాస్తువేత్త (డిప్యూటీ చీఫ్ ఇంజనీర్)తో చెప్పెను.

ఉ. ము. వా. లేచి ముఖ్యఅమాత్యులవారి వద్దకు వెళ్లేసరికే అచట ముఖ్య వాస్తువేత్త (చీఫ్ ఇంజనీర్) సిద్ధముగయుండెను

ముఖ్య అమాత్యులవారు తొలుత ఆ కార్యాలయపు ఉపహారఫలహారశాలని సందర్శించి, అచట గుంపుగా కూర్చుని సంభాషించుకొను వుద్యోగులను, వుద్యోగినులను చూసి పరుషములాడి, అధికారితో వారినందరును తగు రీతిన దండించమని కోరిరి.

తదుపరి ఆయన పరివారము వెంట రాగా కార్యాలయ అంతర్భాగము లోకి చొచ్చిరి అచట పట్టీల (ఫైల్స్) మీద, పొత్తముల మీద (పుస్తకాలు) పేరుకొని యున్న ధూళిని చూసి "ఔరా! ఏమి ఈ కార్యాలయపు తీరుతెన్నులు? ఇచట బంట్రోతు లేడా, ఉన్నచో ఏమిచేయుచున్నాడు?" అని మరి కొన్ని పరుషములాడిరి

ఆ తదుపరి ముఖ్య వాస్తువేత్త కచేరీలోకి వెడలిరి. నీటి పారుదల శాఖా మాత్యులు, అధికార భాషా సంఘపు అధ్యక్షులు కూడా ఆయన వెంటనుండిరి

నీటి పారుదల శాఖామాత్యులు బదిలీ అయిన వాస్తు వేత్తల గురించి అడిగి తెలుసుకొనగా, అధికార భాష సంఘపు అధ్యక్షులు కొన్ని పొత్తములను తెప్పించి చూచి, ఆంగ్ల భాష స్థానంలో తెలుగు వ్రాయబడుచున్నదా లేదానని పరిశీలించిరి

"ఇచట తెలుగు చక్కగా పాటించుచున్నారా? ఏదీ? మీ హాజరు పట్టీని తోడ్కొని రండి. చూసెదను" అని ముఖ్య అమాత్యులు ప్రశ్నించగా వెన్వెంటనే అన్ని శాఖల వుపశాఖల విభాగాల హాజరు పట్టీలు గుట్టగా అచటి మేజాబల్ల మీదికి ఏతెంచెను

ముఖ్య అమాత్యులు కొన్నియు అధికార భాష సంఘపు అధ్యక్షులు కొన్నియు ఆ పొత్తములను విశదముగ పరిశీలించిరి

"ఏమిటి? కొందరు వుద్యోగులు ఇందు పొట్టి సంతకములు ఆంగ్ల భాషలో చేయుచుంటిరి?" అని పరుషములు ఆడుటకు ఆయత్తమవుతుండగా ఉపముఖ్య వాస్తువేత్త చేతులు నలుపుకొనచు "గౌరవనీయమైన అయ్యా. ఎన్నిసార్లు చెప్పినను కొందరు వుద్యోగులు మాట విన్నారేరి" అని ముఖ్య అమాత్యులకు నివేదించెను. ముఖ్య అమాత్యులవారు అట్టి వుద్యోగులను రప్పించమనగా ఓ పదునైదు మందిని హుటాహుటిన తోడ్కొని వచ్చిరి.

"సర్కారువారి ఆదేశమును వుల్లంఘించుట నేరమని నేర్వలేరా?" అని ముఖ్య అమాత్యులు కన్నెర్ర జేసిరి

"అయ్యా, నా పొట్టి చేవ్రాలు మాత్రం ఆంగ్లములో వుండనీయండి" అని అందరు మొర పెట్టుకొనిరి. అధికార భాష సంఘ అధ్యక్షులు కారణమయ్యేను

ఒక డింభకుడు లజ్జతో "అయ్యా! మీరైనా చిత్తగించండి తెలుగు వ్యాకరణ శాస్త్రవేత్తలు మొదటి అక్షరం ఒక్కటుండు పూర్ణసున్నాని ఆ మొదటి అక్షరమునకే చెందవలెనని నిర్వచించిరికదా? మా ఇంటి పేరు లంకా. నన్ను జనార్ధనుడందురు. ఇట్లయిన నా పొట్టి సంతకము ఎట్లుండునో మీరే ఎరుగుదురు" అనెను

మరొకరు అందుకని "అయ్యా మా ఇంటిపేరు గుడి. ఈయన ఇంటి పేరు మర్యాదవారు ఈయన పూదలవారు మా పేర్లు చెప్ప సభ్యత కాదు మీరే గ్రహించగలరు" అని తమ ఇక్కట్టు విశదము చేసిరి.

నిర్దేశింపబడ్డ కర్తాధికారి లేఖ ద్వారా సర్కారు వారు వుదహరించిన ఆదేశములు జారీ చేయబడినా, నిబంధనలు సడలించబడవచ్చుని నిర్ణయమును ద్రుతంగా అచటనే గైకొనిరి. ✱

